## ప్రభుత్వంపై పోరాడేందుకు వెనుకాడం..

### గ్యారెంటీ హామీల అమలు కోసం ఆరు నెలల గడువు ఇచ్చాం.. నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తెస్తా

### విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, జనవరి 9: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఆరు నెలల సమయం ఇచ్చామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అవసరమైతే ఆ హామీల అమలు కోసం ప్రభుత్వంపై పోరాడేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. పేదల పక్షాన పోరాడుతూనే నియోజకవర్గంలో పేరుకపోయిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అసెంబ్లీలో ప్రశ్నించే గొంతుకనవుతానని స్పష్టం చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రమజీవులకు అండగా ఉండేది ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. కమ్యూనిస్టుల గొంతు వినిపించాలనే ఉద్దేశంతోనే ప్రజలు తనను ఈ ప్రాంతం నుంచి అసెంబ్లీకి పంపారని అన్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఇక్కడి ప్రజల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడతానని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో నూతన బొగ్గు బావులను తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. సింగరేణి ఎన్నికల్లో సైతం గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీకి బొగ్గు గని కార్మికులు అగ్రస్థానం ఇచ్చారని, సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. నూతన బొగ్గు గనులు వస్తేనే సింగరేణికి భవిష్యత్ ఉంటుందని అన్నారు. ప్రభుత్వం కూడా నూతన బొగ్గు గనుల ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్తగూడెం పట్టణాభివృద్ధికి బృహత్తర కార్యక్రమాలను చేపట్టబోతున్నామని అన్నారు. సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు సాబీర్‌పాషా, వాసిరెడ్డి సీతారామయ్య, దుర్గరాశి వెంకన్న, రాజ్‌కుమార్, మురళి, జమలయ్య, దస్రు, చంద్రగిరి శ్రీనివాస్, వంగా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఎంట్రీ పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలి

### ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్


మాట్లాడుతున్న కలెక్టర్

మామిళ్లగూడెం, జనవరి 9 : ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ ప్రక్రియ పర్యవేక్షణను ప్రత్యేక అధికారులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ప్రత్యేక అధికారులతో డాటా నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు 100శాతం, టీమ్ లీడర్లు 5శాతం, మండల ప్రత్యేక అధికారులు 1శాతం దరఖాస్తుల పరిశీలన చేయాలన్నారు. ఆధార్, రేషన్ కార్డుల నెంబర్లు సరి చూడాలన్నారు. గుర్తించిన పొరపాట్లకు నివేదిక సమర్పించాలన్నారు. ఎక్కువ పొరపాట్లు చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్లను మార్చాలన్నారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు జి. గణేశ్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసీ ఎం. రాజేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సు కోసమే బీఆర్ఎస్ పోరాటం

- వాగ్దానాల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అప్పుడే అసహనం మొదలైంది
- కేసీఆర్ అధికారంలోకంటే ప్రతిపక్షంలో ఉంటేనే డేంజర్
- ఖమ్మం పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ గెలవాల్సిందే..
- త్వరలోనే రాష్ట్ర, జిల్లా నూతన కమిటీలు ఏర్పాటు
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ నాయకులతో సమీక్ష


ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఖమ్మం, జనవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలుకోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై వత్తిడి తెస్తామని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గత కొన్నిరోజులుగా జరుగుతున్న పార్లమెంట్ నియోజకవర్గాల సమీక్ష సమావేశాల్లో భాగంగా మంగళవారం ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీమంత్రి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీమంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల తరపున పోరాడేందుకు పార్టీ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని అన్నారు. ఒకటీరెండు జిల్లాల్లో తప్ప అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తిరస్కరించలేదనడానికి మనం సాధించిన ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. 39 ఎమ్మెల్యే సీట్లను గెలవడంతోపాటు 11 స్థానాలు అత్యల్ప మెజార్టీతో చేజారిపోయాయని గుర్తుచేశారు. ఇంకా కొన్నిచోట్ల పలు కారణాలతో సీట్లు కోల్పోయామన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల్లో ఉన్న అసంతృప్తికి కారణాలు చర్చించుకుని సమీక్షించుకొని ముందుకు సాగుదామని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై నెలదాటిందని, వచ్చిన తెల్లారినించే వాగ్దానాలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు హామీల అమలులో కాలయపన చేస్తున్నారన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసహనం ప్రారంభమైందన్నారు. ఇదిఇలాగే కొనసాగే పరిస్థితి ఉన్నదని, ప్రజల విశ్వాసాన్ని స్వల్పకాలంలో కోల్పోయే లక్షణం కాంగ్రెస్ పార్టీ సొంతమని, గత చరిత్రను పరిశీలిస్తే అర్థమయ్యేది కూడా అదేనన్నారు. 1983లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన అనంతరం రాజకీయ పరిణామాలను గమనిస్తే ఈ విషయం అర్థమౌతుందన్నారు. 1989 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పార్టీని తిరస్కరించి కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలు కేవలం ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ పార్టీ మీద విశ్వాసాన్ని కోల్పోయారని గుర్తుచేశారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ అనంతరం జరిగిన నాటి లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలయ్యిందని, ఆ ఎన్నికల్లో అదే ప్రజలు టీడీపీని తిరిగి భారీ మెజార్టీతో గెలిపించిన సంగతి మనం మరువకూడదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకునే నిజాయితీ, చిత్తశుద్ధి కాంగ్రెస్‌కి ఉండదనేది గత నెలరోజుల ఎన్నికల అనంతర పరిణామాలను పరిశీలిస్తే మరోసారి రుజువైందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు రాజకీయ అస్తిత్వంగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను గెలిపించిందన్నారు. పదేండ్ల అనతికాలంలోనే దేశానికే ఆదర్శంగా నిలబెట్టిందని, తెలంగాణ గళం, బలమూ బీఆర్ఎస్సే అన్నారు. రాబోయే ప్రతి అడుగులో కేసీఆర్ దళంగా ఐకమత్యంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నప్పటికన్నా ప్రతిపక్షంలో ఉంటేనే మరింత పోరాట పటిమ చూపగలమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కేసీఆర్ అసెంబ్లీకొస్తే ఇంకా ఎలా ఉంటుందో ఊహించుకోవాలని, కేసీఆర్ అధికారంలో ఉండటం కన్నా ప్రతిపక్షంలో ఉండటమే డేంజర్ అని పేర్కొన్నారు. సీఎం అనే రెండక్షరాల కన్నా కేసీఆర్ అనే మూడు అక్షరాలే పవర్ ఫుల్ అన్నారు. ఫిబ్రవరిలో కేసీఆర్ ప్రజల మధ్యకు వస్తారని, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమీక్షలు ముగియగానే అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలు ఉంటాయని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర, జిల్లా నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి రెండు మూడు నెలలకోసారి అన్ని కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తామని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం సీటును కచ్చితంగా గెలవాల్సిందేనన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఆర్జేసీ కృష్ణ, జిల్లాకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

## తగ్గిన తేజస్సు

- ఒక్కరోజులోనే క్వింటాకు రూ.500 తగ్గిన ధర
- ఆందోళన చెందుతున్న మిర్చి రైతులు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 9 : మార్కెట్‌లో మిర్చి ధరలు రోజురోజుకూ తగ్గుతుండడంతో ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్క రోజులోనే తేజా రకం మిర్చి ధర క్వింటాకు రూ.500 తగ్గడంతో అయోమయానికి గురవుతున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డులో మంగళవారం ఉదయం జరిగిన జెండా పాటలో తేజా రకం మిర్చి క్వింటా ధర రూ.20,500 పలికింది. సోమవారం ఇదే మార్కెట్‌లో క్వింటా ధర రూ.21 వేలు పలికింది. సీజన్ ఆరంభంలో క్వింటా ఒక్కంటికి దాదాపుగా రూ.24 వేల వరకు ధర పలకగా.. వారం రోజుల వ్యవధిలోనే రూ.20 వేలకు చేరడంతో మిర్చి సాగు రైతులు నిరుత్సాహానికి లోనయ్యారు. కాగా.. ఉదయం జెండా పాట సమయానికి వివిధ జిల్లాల నుంచి రైతులు దాదాపు 20 వేల మిర్చి బస్తాలను విక్రయానికి తీసుకొచ్చారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా పంట దిగుబడి బాగా తగ్గడంతో ఆశించిన మేర ప్రయోజనం లేకపోయింది. సంక్రాంతి పండుగ తర్వాత ధరల్లో కొంత వ్యత్యాసం వచ్చే అవకాశం ఉన్నదని కొందరు వ్యాపారులు పేర్కొంటున్నారు.

## ధాన్యం దళారుల పాలు

- మద్దతు ధర లేకపోవడంతో తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు
- సేకరణ చివరి దశలోనూ 20 శాతమే కొనుగోళ్లు
- సన్నాలకు పెరిగిన డిమాండ్
- లక్ష టన్నుల సేకరణ జరిగేనా ?



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : ధాన్యం దళారుల పాలవుతున్నది. ప్రభుత్వం మద్దతు ధరకంటే బయట సన్నబియ్యానికి రేటు పలకడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే విక్రయాలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో సర్కారు కొనుగోలు కేంద్రాలు 69 కే పరిమితం అయ్యాయి. భద్రాద్రి జిల్లాలో ఇప్పటి వరకు 157 కేంద్రాల్లో కొనుగోలు జరగాల్సి ఉండగా.. కేవలం 69 కేంద్రాల్లో మాత్రమే విక్రయాలు జరుగుతున్నాయి. ప్రతీ ఏడాది వానకాలం లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 12,766 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం సేకరించగలిగింది. ఇంకా కొన్నిచోట్ల కోతలు ఆలస్యం అవడంతో మరో 25 వేల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**సేకరణ చివరి దశలోనూ 20 శాతమే కొనుగోళ్లు**

ధాన్యం సేకరణ చివరి దశకు వచ్చినా సేకరణ మాత్రం ఇంకా 20 శాతంలో ఉండడం విశేషం. ఏడాది లక్ష్యం లక్ష మెట్రిక్ టన్నులు కాగా.. ఇప్పటి వరకు కేవలం 12,766 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాలు తెరుచుకున్నా రైతులు మాత్రం అటువైపు చూడడం లేదు. సన్న బియ్యానికి బయట మార్కెట్‌లో ధర ఉండడంతో రైతులు బయట వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం రూ.2,203 ప్రకటించడంతో బయట రూ.2,300 నుంచి రూ.3 వేల వరకు పలుకుతున్నది. దీంతో రైతులు దళారుల వైపే మొగ్గు చూపుతున్నారు.

**సన్నాలకు పెరిగిన డిమాండ్**

ఒక వైపు వర్షాలు, మరోవైపు అకాల తుఫాను రావడంతో రైతులు పండించిన పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో సన్న బియ్యానికి అమాంతం రేటు పలికింది. బయట మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలు రావడంతో వ్యాపారులు రైతుల ఇంటికే వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వందల మంది వ్యాపారులు ధాన్యాన్ని విక్రయాలు చేస్తున్నారు.

### బయట రేటు ఎక్కువ ఉంది..



మద్దతు ధర ఏ గ్రేడ్ రకం రూ.2,203 ఉంది. బయట వ్యాపారులు రూ.2,300 నుంచి రూ.3 వేల వరకు కొనుగోళ్లు చేస్తున్నారు. అందువల్ల కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు రావడం లేదు. కొన్ని ఏరియాల్లో ధాన్యం ఉన్నా చివరి సమయంలో కేంద్రాలకు వస్తున్నది. లక్ష్యానికి చేరువలో కొనుగోలు చేస్తాం. లాభం ఉన్న దగ్గరే రైతులు విక్రయాలు చేస్తారు.

**- త్రినాథ్, జిల్లా సివిల్ సప్లై అధికారి**



## రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

### భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, జనవరి 9 : ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడానికి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ట్రాక్టర్ల యజమానులు ట్రక్కు వెనుక భాగంలో స్టిక్కర్లు తప్పనిసరిగా కనిపించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం, బైక్‌లకు సైలెన్సర్ షాట్స్ అమర్చి శబ్ద కాలుష్యంతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా జిల్లా పోలీసులు తీసుకునే చర్యలకు ప్రజలంతా సహకరించాలని ఎస్పీ కోరారు.

## 'ఆన్‌లైన్' త్వరితగతిన పూర్తి చేయండి

### భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల


కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. మంగళవారం ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి ఆన్‌లైన్ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను ఆయా మండలాల ఎంపీడీవోలు కార్యాలయాల్లో ఆన్‌లైన్ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయడంతోపాటు వాటి సమాచారం గోప్యంగా ఉంచాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,33,225 దరఖాస్తులు రాగా.. వాటిలో 1,90,870 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామన్నారు. మొత్తంగా 60 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. 22 మండలాల్లో 2,75,402 దరఖాస్తులు రాగా.. 1,63,493 ఆన్‌లైన్ అయ్యాయన్నారు. మున్సిపాలిటీల పరిధిలో 57,823 దరఖాస్తులు రాగా.. అందులో 27,377 ఆన్‌లైన్ అయినట్లు వివరించారు.

## మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా దామోదర్

- ఇటీవల కేంద్ర కమిటీ సభ్యుల సమక్షంలో బాధ్యతల స్వీకరణ
- ఏడుగురు కేంద్ర కమిటీ సభ్యుల సమక్షంలో నియామకం
- వ్యూహరచనలో సిద్ధహస్తుడు, మోస్ట్ వాంటెడ్‌గా మిలటరీ చీఫ్ దామోదర్


చొక్కారావు అలియాస్ దామోదర్ (ఫైల్)

కొత్తగూడెం క్రైం, జనవరి 9 : మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి ప్రాంతానికి చెందిన మిలటరీ చీఫ్ బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్నను ఆ పార్టీ నియమించింది. ఇటీవలే ఆయన కేంద్ర కమిటీ సభ్యుల సమక్షంలో పూర్తి బాధ్యతలు స్వీకరించినట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ మళ్లీ తన ఉనికిని చాటుకోవడంతోపాటు తెలంగాణలో పాగా వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం కేంద్రంగా మావోయిస్టులు తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తూ.. అప్పుడప్పుడు అలజడులు సృష్టిస్తూ వస్తున్నారు. అయితే మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కోవిడ్ బారినపడి 21, జూన్ 2021లో మృతిచెందిన విషయం విదితమే. దీంతో అప్పటి నుంచి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి స్థానాన్ని భర్తీ చేసేందుకు ఆ పార్టీ కట్టుదిట్టమైన వ్యూహాలు రచించింది. ఈ స్థానాన్ని దక్కించుకునేందుకు మావోయిస్టు నేత ఆజాద్ సైతం తనవంతు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. చివరికి మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా మిలటరీ చీఫ్ బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్నను నియమించింది. ఇటీవల మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు, ఏఓబీ రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సాయన్న, కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్ మడివి హిడ్మా అలియాస్ హిద్మాతోపాటు మరికొందరు కీలక నేతలతో జరిగిన సమావేశంలో బడే చొక్కారావుని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దక్షిణ బస్తర్ కేంద్రంగా ఈ సమీక్ష జరిగినట్లు తెలిసింది. ఈ సమయంలోనే ఛత్తీస్‌గఢ్‌కి చెందిన ప్రత్యేక భద్రతా దళాలు మావోయిస్టుల సమావేశంపై సమాచారంతో కూంబింగ్ ఆపరేషన్స్ నిర్వహించి.. వారి జాడ తెలియకపోవడంతో వెనుతిరిగిన విషయం విదితమే. తెలంగాణ రాష్ట్ర మిలటరీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న బడె చొక్కారావుకి మావోయిస్టు పార్టీ ఈ కీలక పదవిని అప్పగించడంతో ఆ పార్టీ వ్యూహాలపై సంకేతాలు అందుతున్నాయి. గతంలో భద్రతా దళాలను టార్గెట్ చేసి వారిపై జరిపిన కాల్పుల ఘటనతోపాటు ల్యాండ్‌మైన్ పేల్చిన ఘటనల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటికే కొంత కాలంగా తెలంగాణ రాష్ట్రంలోకి చొచ్చుకొచ్చేందుకు మావోయిస్టు పార్టీ చేస్తున్న వ్యూహాలతో రాష్ట్ర పోలీస్ శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. వ్యూహరచనలో సిద్ధహస్తుడైన 47 ఏళ్ల చొక్కారావు తెలంగాణ ప్రాంతంలో ఉనికిని ఏ విధంగా చాటుకోనున్నాడో..? మోస్ట్ వాంటెడ్ చొక్కారావు వ్యూహాలకు పోలీస్ శాఖ ఎలా బదులివ్వనున్నదో..? వేచి చూడాల్సిందే.

## కొనసాగిన ఇగ్నైట్ ఫెస్ట్


యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

భద్రాచలం, జనవరి 9 : పట్టణంలోని గిరిజన గురుకుల విద్యాసంస్థలో నిర్వహిస్తున్న ఇగ్నైట్ ఫెస్ట్ మంగళవారం రెండో రోజుకు చేరింది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన 1,500 మంది బాలబాలికలకు ఇగ్నైట్ ఫెస్ట్‌లో భాగంగా యూత్ పార్లమెంట్, యూఎన్‌వో, ఫ్లోర్ ఆర్ట్, స్పెల్ బీ, ఫ్యాషన్ షో, వ్యాసరచన, వక్తృత్వ, స్పాట్ డ్రాయింగ్, వీడియో మేకింగ్, స్టోరీ, టెల్లింగ్, సైన్స్ ఫెయిర్, పాటలు, గ్రూప్ డాన్స్ తదితర 28 అంశాల్లో పోటీలు నిర్వహించారు. కాగా.. పోటీల్లో విజయం సాధించిన బాలబాలికలకు పారితోషికంతోపాటు ప్రశంసా పత్రాలు, ట్రోఫీ లు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రీజియన్లలో నిర్వహించిన ఇగ్నైట్ ఫెస్ట్‌లో పాల్గొని విజయం సాధించిన బాలబాలికలు స్టేట్‌మీట్‌లో పాల్గొనడంతో పోటీ ఆసక్తికరంగా సాగుతోంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గిరిజన గురుకులాల డిప్యూటీ సెక్రటరీ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇగ్నైట్ ఫెస్ట్ గిరిబిడ్డలకు ఎంతో విజ్ఞానాన్ని పెంచుతుందన్నారు. ఇలాంటి పోటీ ల్లో పాల్గొనడం ద్వారా బాలబాలికల్లో మరింత సృజనాత్మకశక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన గురుకులాల ఓఎస్డీ సీఈఎస్ సుమలత, భద్రాచలం గురుకుల ఆర్సీవో వెంకటేశ్వరరాజు, వరంగల్ ఆర్సీవో డీఎస్.వెంకన్న, భద్రాచలం గిరిజన గురుకుల ప్రిన్సిపాల్ మెండెం దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాలను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న డీసీసీబీ సీఈవో రెహమాన్

ఖమ్మం వ్యవసాయం, జనవరి 9 : సహకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డీసీసీబీ సీఈవో అబ్దుల్ ఉర్ రెహమాన్ అన్నారు. నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశ మందిరంలో మంగళవారం సహకార సంఘాల సీఈవోలకు సుపరిపాలన(కార్పొరేట్ గవర్నెన్స్ ఇన్‌ప్యాక్స్) అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని సొసైటీ అధ్యక్షులు, సీఈవోలు హాజరయ్యారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్లుగా రాష్ట్ర సహకార బ్యాంక్(టెస్కాబ్)కు చెందిన విజయశంకర్, సుబ్బారావు వ్యవహరించారు. సహకార పరపతి వ్యవస్థ, సంఘాల ముఖ్యోద్దేశం, పీఏసీఎస్‌ల నియమావళి, సహకార సంఘాల చట్టాలు, సుపరిపాలన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, సహకార సంఘాల అధ్యక్షులు, సీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

-మిగతా వార్తలు 8వ పేజీలో..